క్లుప్తంగా

మూడో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండరామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం హోమం జరిగింది. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్.రాజు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సురభి నాటక ప్రదర్శన



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సృజనాత్మక సమితి, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల్లో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలు పద్య నాటక వైభవాన్ని చాటుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, శ్రీ సరదా కళావినోదిని ఆధ్వర్యంలో జై పాళ భైరవి జానపద నాటకాన్ని ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో సాంస్కృతిక శాఖ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు సుమన్, నర్తనం ప్రధాన సంపాదకురాలు మాధవి పాల్గొన్నారు.

హరీష్ మిత్ర కుటుంబ సభ్యులకు పరామర్శ



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు తలారి హరీష్ మిత్ర అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని మృతుడి నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. హరీష్ మిత్ర కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని పేర్కొన్నారు. హరీష్ మిత్రకు నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కోట జయరాజు సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం వాకర్స్ క్లబ్ శాశ్వత సభ్యులు, వాకర్, అడ్వొకేట్ కోట జయరాజు సేవలు నిరుపమానమని పలువురు కొనియాడారు. డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జయరాజు సంస్మరణ కార్యక్రమం వాంబేకాలనీలో జరిగింది. ఈ సందర్భంగా జయరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో ఉన్నవారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ డెప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, పి.రాజారావు, హనుమంతరావు, గుర్రం లీలాకుమార్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. 58వ డివిజన్ కృష్ణ హోటల్ సెంటర్‌కు చెందిన వేముల శాంతికి రూ.25,933, అచ్యుత శివపార్వతికి రూ.1,21,067, షేక్ అమిర్‌బాషాకు రూ.67,647, యర్రం శెట్టి శివకుమార్‌కు రూ.65,350, అయోధ్య నగర్‌కు చెందిన యడ్లలక్ష్మికి రూ. 41,500, చిగురుపాటి శివపార్వతికి రూ.81,000ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తాగునీరు అందక ప్రజల ఇక్కట్లు

- శివారు ప్రాంతాల్లో సమస్య తీవ్రం
- ఉప్పునీరు కలుస్తోందని గగ్గోలు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరానికి శివారు ప్రాంతాలైన 62, 63, 64 డివిజన్లలోని ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. కండ్రిక ఎస్ బోస్ నగర్లోని 15 లక్షల ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సరిపడా కృష్ణానది నీరు రాక పోవడంతో ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందడం లేదు. నీటి సరఫరా విభాగం లోని కొందరు ఉద్యోగులు కండ్రిక బోస్ నగర్లోని ట్యాంక్‌కు రావాల్సిన నీటిని అక్రమంగా అమ్ముకోవడం వలన శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరు సరఫరా అందడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పన్నులు వసూలు చేయడమేనా..

విజయవాడ నగర పాలక సంస్థ ప్రజల నుంచి ప్రతి ఆరు నెలలకు ఇంటిపన్ను, అందుకు మూడు రెట్లు అదనంగా నీటి పన్ను, డ్రెయినేజీ పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తుందే కానీ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణానది నీటిని ఎందుకు సరఫరా చేయలేక పోతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షలను ప్రజలు వివిధ పన్నుల రూపంలో వీఎంసీకి చెల్లిస్తున్నారు. తాగునీరు



కండ్రిక బోస్‌నగర్లోని వాటర్ ట్యాంక్

కూడా వీఎంసీ సరఫరా చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 62వ డివిజన్ లోని ఏడు అపార్టుమెంట్ల ప్రజలు కృష్ణానది నీరు అందక ఉప్పునీరు తో తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. అలాగే 63వ డివిజన్లో రాజీవ్‌నగర్, వడ్డెర కాలనీ ప్రజలు సైతం కృష్ణానది నీరు అందక అగచాట్లు పడుతున్నారు. 64వ డివిజన్‌లో రాధానగర్, ప్రజాశక్తి నగర్ ప్రాంతాల్లోని ప్రజలకు కృష్ణానది నీటి పైపుల్లో ఉప్పునీరు వస్తోందని, ఆ నీటిని తాగలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను పలుమార్లు వీఎంసీ అధికారులకు చెప్పినా ఫలితంలేదని అంటున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన తాగునీటి పైపు లైను తుప్పు పట్టి రంధ్రాలు పడటంతో నీరు కలుషితం అవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రజలు అభ్యంతరం చెప్పినప్పుడల్లా కంటితుడుపు చర్యగా అధికారులు తాగునీటి పరీక్షలు చేయడం.. నీటిలో కలుషితం లేదని చెప్పడం జరుగుతోంది.

వ్యాధుల బారిన ప్రజలు

బోరు నీరు అధికంగా సరఫరా కావడంతో ప్రజలు ఆ నీటిని తాగితే వ్యాధులు సంభవిస్తున్నాయని అంటున్నారు. బోరు నీరు తాగడం వలన కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు చెబుతున్నారు. దీంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు వద్దకు వెళ్లి 20 లీటర్ల క్యాన్ రూ.15 చెల్లించి మంచినీటిని కొనుగోలు చేస్తున్నారు. కూలింగ్ వాటర్ 20 లీటర్లు రూ.30కు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా వీఎంసి అధికారులు కృష్ణానది నీటిని తాగునీరుగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉదయం 5 నుంచి 5.45 వరకు అపార్టుమెంట్లకు, 6 నుంచి 7.30 వరకు వీధి కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఆ సమయాల్లో మోటార్లు ఉన్న వారు అధిక సామర్థ్యం గల మోటార్లు ఉపయోగించి నీటిని తోడుకుంటున్నారు. వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రైవేటు ఆర్వో ప్లాంటు

నీటిని తాగేలేక పోతున్నాం



విజయవాడ నగర పాలక సంస్థ సరఫరా చేసే నీరు ఉప్పుగా వస్తున్నాయి. ఆ నీటిని తాగలేక పోతున్నాం. తాగటానికి అనువైన నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎల్. నిర్మల, 63వ డివిజన్

నీటిని సరఫరా చేసే సమయం పెంచాలి



వీఎంసీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసే సమయాన్ని పెంచాలి. వేసవి కాలంలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది కాబట్టి అధికారులు సమయాన్ని పొడిగించండి.

– శివయ్య, ప్రజాశక్తి నగర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ మ్యూజియం రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సీవీఆర్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజియం రోడ్డు, కోర్టు కాంప్లెక్స్‌ఏరియా, చెరుకుపల్లి వారి వీధి, కోదండరామిరెడ్డి వీధి, వెంకటేశ్వరావు వీధి, రామమందిరం వీధి, ఆంధ్ర హాస్పిటల్ ఏరియా, ప్రకాశం రోడ్డు, జేడీ హాస్పిటల్ రోడ్డు, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, దుర్గయ్య వీధి, కస్పావారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

21న జీరో పావర్టీ పాలసీపై పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జీరో పావర్టీ పీ4 పాలసీపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, డిబేట్ అంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలకు ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని ఆమె కోరారు

సునీతా విలియమ్స్ సాధించిన విజయం ఆదర్శం

పాయకాపురం(విజయవాడ రూరల్): ప్రపంచ అంతరిక్ష పరిశోధన యాత్రికురాలు సునీతా విలియమ్స్ సాధించిన విజయం అందరికీ ఆదర్శనీయమని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల వలన వాతావరణంలోని మార్పులకు కారణాలను కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కనుక ఇలాంటి గొప్ప ప్రయోగాలను శాస్త్రవేత్తలు చేస్తూ ఉంటారన్నారు. నాసా తరపున సునీత విలియమ్స్ తొమ్మిది నెలల క్రితం పరిశోధనల కోసం అంతరిక్ష యానం చేసిన విషయం తెలిసిందేనన్నారు. అయితే యాంత్రిక లోపం వలన సునీత విలయమ్స్ అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందన్నారు. ఆమెను భూమ్మీదకు తీసుకురావడానికి శాస్త్రవేత్తలు అనేక ప్రయత్నాలు చేశారన్నారు. అవరోధాలు కలిగినా ఎట్టకేలకు అంతరిక్ష నౌక ద్వారా భూమి పైకి సురక్షితంగా తీసుకొచ్చారన్నారు. భారతి సంతతికి చెందిన ఒక స్త్రీ ప్రపంచ అంతరిక్ష యాత్రికురాలిగా గొప్ప విజయాన్ని సాధించారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపే విధంగా అనేకమంది శాస్త్రవేత్తలు విజయ యాత్రలు నిర్వహించారన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక సంపదను పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉదయలక్ష్మి, ఉపాధ్యాయులు నళిని శిరీషా పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సాధువులపై ప్రభుత్వం తీరు అమానుషం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తిరుమలలో సాధువుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానుషమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతి నుంచి విశాఖపట్నం వెళుతున్న రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని మార్గమధ్యంలో బుధవారం మల్లాది విష్ణు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయటంపై ఆయన తీవ్రంగా స్పందించారు. హిందువుల మనోభావాలకు విరుద్ధంగా తిరుమలలో నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌కు అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక నగరాన్ని పర్యాటకం పేరిట కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత ముంతాజ్ హోటల్ నిర్మాణంపై సాధువులు, హైందవ సంఘాలు భగ్గు మంటున్నా ఈ ప్రభుత్వంలో కనీస చలనం లేదని ధ్వజమెత్తారు. తిరుమల ప్రక్షాళన అంటే ఏడు కొండలను అపవిత్రం చేయటమా..? అని ప్రశ్నించారు. తిరుమల కొండలను కళంకం చేసేలా అన్యమతానికి చెందిన ముంతాజ్ హోటల్ నిర్మాణానికి అనుమతివ్వడం దారుణమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ పట్ల, తిరుమల పవిత్రత పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలను ఒక వ్యాపార కేంద్రంగా మార్చివేసిందన్నారు. హిందు ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత సాధువులపై ఉందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సాధువుల పట్ల ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. తిరుమల ప్రక్షాళన అంటూ వల్లె వేసే సీఎం చంద్రబాబు, సనాతన ధర్మ పరిరక్షణ అంటూ ఊగిపోయే డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీనిపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను గౌరవించి హోటల్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా హైందవులు ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించటం ఖాయమని హెచ్చరించారు.



రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని కలిసి మాట్లాడుతున్న మల్లాది విష్ణు

కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం 'కోర్టు'

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం కోర్టు నటుడు శివాజీ అన్నారు. కోర్టు చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పేందుకు చేపట్టిన విజయ యాత్ర బుధవారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని ఓ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. నటుడు శివాజీ మాట్లాడుతూ 13 ఏళ్ల తర్వాత వెండి తెరపై రీ ఎంట్రీ ఇచ్చానని, మంగపతి క్యారెక్టర్ ప్రేక్షకుల మనసులో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. పోక్సో చట్టం గురించి, మైనర్లు ప్రేమించుకుంటే ఏమవుతుంది అనే కథపై ఈ చిత్రం ఉంటుందన్నారు. అనంతరం నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ నేచురల్ స్టార్ నాని ప్రొడక్షన్‌లో వాల్ పోస్టర్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని తెరపైకి ఎక్కించారని, ఈ సినిమాలో అవకాశం రావడం నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు రామ్ జగదీష్ మాట్లాడుతూ ఈ చిత్రం తీసే ముందు ఎంతోమంది న్యాయవాదులను కలిశానని పోక్సోకి సంబంధించిన కేసులను స్టడీ చేశానని, రియాలిటీకి దగ్గరగా ఈ చిత్రాన్ని నిర్మించామని చెప్పారు. హీరో రోషన్, హీరోయిన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చిత్ర బృందం

సేవా సంస్థలకు రూ.15 లక్షల సాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): బంగారు, వజ్రాభరణాల సంస్థ వసుధర డైమండ్ రూఫ్ పదో వార్షికోత్సవం సందర్భంగా వివిధ సేవా సంస్థలకు రూ.15 లక్షలకు పైగా సాయం అందజేసింది. మహాత్మా గాంధీరోడ్డులోని షోరూమ్‌లో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవంలో భాగంగా విజయమేరి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ద బ్లైండ్, కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్టు, ఆషా జ్యోతి హ్యాండీక్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ, మరనాత విముక్తి చారిటీస్, చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్, విద్యాలయ చిల్డ్రన్స్ హోమ్ ఫర్ గరల్స్ సంస్థలకు ఆ సాయాన్ని షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర అందజేశారు. తొలుత ఆ షోరూమ్ మహిళా కస్టమర్లతో ఆభరణాల ప్రదర్శన, ర్యాంప్ వాక్ నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా షోరూమ్‌లో కంచిపట్టు చీరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన గురువారం కూడా కొనసాగనుంది. కార్యక్రమంలో షోరూమ్ హెడ్ అట్లూరి మేఘన పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వసుంధర

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



మధురానగర్(విజయవాడసెంట్రల్): తన కుమారుడు గత నెల 25వ తేదీ నుంచి కనిపించటం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు గన్నవరం గుండ్రపాటి పుష్పమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు గుండ్రపాటి రవికుమార్ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఈయన అజిత్‌సింగ్‌నగర్ ఎంకేబేగ్ స్కూల్ సమీపంలో నివసిస్తున్నాడు. ఇతడి భార్య వదిలివేయటంతో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిస కావటంతో తల్లి తరచూ ఆర్థిక సాయం చేస్తుండేది. ఈ క్రమంలో గత నెల 25వ తేదీన రవికుమార్ ఫోన్ చేసి తాను కొత్త ఫోన్ కొన్నానని తన నంబర్ ఫీడ్ చేసుకోవాలని తల్లికి చెప్పాడు. తల్లి ఫోన్ నంబర్ ఫీడ్ చేసుకున్న తరువాత సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో ఆమె అజిత్‌సింగ్‌నగర్ వచ్చి చూడగా కుమారుడు ఇంట్లో లేడు. అప్పటి నుంచి చుట్టు పక్కల వారి వద్ద విచారించారు. ఫలితం లేకపోవటంతో బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాను చేసే బిజినెస్‌లో పెట్టుబడి పెడితే ప్రతి నెలా అధిక లాభాలు ఇస్తానని చెప్పి మహిళను మోసం చేసిన వ్యక్తిపై భవానిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు విద్యాధరపురం గుప్తా సెంటర్‌కు చెందిన షేక్ ఖయుర్‌జహాన్ ముస్లిం పిల్లలకు మదరసాలో చదువు నేర్పిస్తోంది. ఆమెకు మూడేళ్ల క్రితం తయ్యబ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను మదరసా స్థాపిస్తున్నానని పిల్లలకు చదువు చెప్పేందుకు టీచర్‌గా రమ్మని ఆఫర్ ఇచ్చాడు. ఆ తర్వాత పేద ముస్లింలను ధనికులను చేసేందుకు తానొక బిజినెస్ స్టార్ట్ చేస్తున్నానని, అందులో పెట్టుబడి పెట్టాలని కోరాడు. రూ. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ. 10వేలు లాభం ఇస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన ఆమె తాను పొదుపు చేసుకున్న రూ. 28 లక్షలు అతడికి ఇచ్చింది. ఆ తర్వాత ఆమెకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా వాయిదాలు వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఖయుర్ జహాన్ ముస్లిం పెద్దలలో పంచాయితీ పెట్టింది. అయితే అతను ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత ఆమె కుమారుడు హమీద్ వెళ్లి డబ్బులు అడిగితే అతడిపై దాడి చేశాడు. దీనిపై బాధితురాలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలి

రాజకీయ ప్రతినిధులతో సమీక్షలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు నడుచుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్లకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల నుంచి దగ్గరగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు మార్చవలసిందిగా పలు పార్టీల ప్రతినిధులు కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల సంఖ్య 1,200కంటే ఎక్కువగా ఉన్న ఏరియా సమీపంలోని పోలింగ్ స్టేషన్లకు మార్పులు చేయాలన్నారు. ఏఈఆర్వోలను, బీఎల్ఓతో ఒక సమావేశం నిర్వహించి పోలింగ్ బూతులను బీఎల్ఓ పరిశీలించి, వసతులన్నీ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్లకు ఓటర్ ఐడీ కార్డులు పోస్ట్ ద్వారా లేదా బీఎల్‌వో(బూత్‌లెవల్ అధికారి) ద్వారా కానీ పంపిణీ చేసేటట్టు చర్యలు తీసుకోవాలని ఏఈఆర్‌వో(అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి)లను ఆదేశించారు. గేటెడ్ కమ్యూనిటీలో కాలనీలో ఓటర్లకు ఆ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలను కేటాయిస్తే ఓటర్లు పూర్తి స్థాయిలో ఓటు వేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎస్‌వీఈపీ (సిస్టమాటిక్ ఓటర్లు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టానిక్ పార్టిసిపేషన్) కార్యక్రమాల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించాలని ఈ సమావేశంలో సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాజకీయ ప్రతినిధులు ఎస్. నరసింహా రావు (కాంగ్రెస్) వీరభద్రరావు (సీపీఐ), వినోద్ కుమార్ (బీఎస్పీ), తరుణ్ (బీజేపీ), సాంబశివ రావు (టీడీపీ), సుందర్ పాల్ (వైఎస్ఆర్ సీపీ) పరమేశ్వరరావు (ఏఏపీ), విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చలసాని వెంకటరత్నంకు ఘన నివాళి

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణిగారి తోట, చలసాని నగర్‌లోని సిద్దెం కృష్ణారెడ్డి భవన్ వద్ద పేదల మనిషి చలసాని వెంకటరత్నం 53వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ 17, 18వ డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వెంకటరత్నం చిత్ర పటానికి సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు సంగుల పేరయ్య పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సీపీఐ 17, 18 డివిజన్ల కార్యదర్శులు సయ్యద్ సుభానీ, అంబడపూడి మోహన్‌కుమార్, నాయకులు స్టాలిన్, క్రాంతికుమార్, ఆంజనేయులు ప్రవీణ్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతపై పట్టు అవసరం

గుణదల(విజయవాడ తూర్పు): ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోందని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ధర్మతేజ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల బీబీఏ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ యుగంలో మేనేజ్ మెంట్ లీడర్ షిప్ అంశంపై జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రిస్క్ మేనేజ్‌మెంట్, అనుకూలత, చురుకుదనం, ఆవిష్కరణల ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆ మార్పులకు అనుగుణంగా కరెంట్ అఫైర్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ఫాదర్ మెల్కియోర్, బీబీఏ విభాగాధిపతి దుర్గాభవాని, కో–ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ధర్మతేజ, లయోల సిబ్బంది

రేపటి నుంచి జాతీయ స్థాయి సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్దేశించే పర్యావరణ, సామాజిక, పాలనా కారకాలు అనే అంశంపై బ్రహ్మయ్య అండ్ కో సంస్థ మేనేజింగ్ పార్టనర్ పర్వతనేని సంతోష్ కుమార్ కీలక ఉపన్యాసం చేస్తారని, ప్రధాన వక్తలుగా ముంబయికి చెందిన ఐఎస్ఎస్ స్టాక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.హరీష్ శ్రీవాస్తవ, ఎంఎస్‌సీఐ(ముంబయి) సీనియర్ అసోసియేట్ డాక్టర్ టీ.శశిజ్యోత్స్న, కేసీపీ గ్రూప్ ఈహెచ్ఎస్ విభాగాధికారి డాక్టర్ బాలకృష్ణ, సేఫ్ ఎన్విరాన్ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సదస్సునకు సంబంధించిన పూర్తి వివరాలకు సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్ రెహమాన్(98669 65767)ను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

సామూహిక అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

గన్నవరం: ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరుకు చెందిన బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఎనిమిది మంది నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బీ. కీర్తి డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఐద్వా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ వీరపనేనిగూడెంలో స్నేహితురాలి ఇంటికి వచ్చిన సదరు బాలికపై గ్యాంగ్ రేప్ చేయడం సభ్యసమాజం తలదించుకునే విషయమన్నారు. గంజాయి తాగుతూ అల్లరిచిల్లరగా తిరిగే యువకులే ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోందన్నారు. గంజాయి నియంత్రణ విషయంలో ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో చేస్తుందేమీ లేదన్నారు. బాలికపై సామూహిక అత్యాచార సంఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిందితులను త్వరగా శిక్షించడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఐద్వా నాయకులు స్వరూపరాణి, సిహెచ్‌వీ. లక్ష్మీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.